సీసీ రోడ్డు మరమ్మతుల పరిశీలన



సీసీ రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ బీడీఎల్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు మరమ్మతు పనులను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కార్పొరేటర్

హయత్‌నగర్, మే 10(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు సకాలంలో ఆస్పత్రికి రావడం లేదని, ప్రజలకు సరియైన వైద్య సేవలు అందించడం లేదని ఫిర్యాదు రావడంతో ఆస్పత్రిని సందర్శించినట్లు తెలిపారు. సిబ్బంది, డాక్టర్లు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. శివారు ప్రాంతాల నుంచి అనేక మంది పేద ప్రజలు ఇక్కడికి వస్తారని తెలిపారు. సరియైన సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అని రోగులను అడిగారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నా డాక్టర్లు మాత్రం లేరని అన్నారు. మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్లు విఫలం అవుతున్నారని తెలిపారు. డాక్టర్ దుర్గ, పురుషోత్తం, రిచల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి స్లాట్ బుకింగ్ ద్వారానే రిజిస్ట్రేషన్లు

మన్సూరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): స్లాట్ బుకింగ్‌ల ద్వారానే ఇకపై రిజిస్ట్రేషన్లు అనుమతించబడతాయని, స్లాట్ బుకింగ్ విధానాన్ని 12వ తేదీ నుంచి ప్రవేశపెట్టనున్నామని వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు నిత్యం 48 స్లాట్ బుకింగ్‌లు అందుబాటులో ఉంటాయని, ఇందుకోసం 'రిజిస్ట్రేషన్.తెలంగాణ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకోండి : కోట్ల



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

సైదాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్ రోడ్లపై అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ శనివారం మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. మండీలో వ్యాపారాలు చేసుకునేందుకు మార్కెటింగ్ శాఖ 62మందికి లైసెన్స్‌లు జారీ చేసిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న వ్యాపారాలతో ట్రాఫిక్ జామ్‌తో పాటు శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని పేర్కొన్నారు. మార్కెట్‌లో జరుగుతున్న అక్రమ వ్యాపారాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

'హైదరాబాద్ పోరడు-2' సాంగ్ పోస్టర్ ఆవిష్కరణ



పాటకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర ప్రజల జీవన విధానం, ఆహారం, ఇతర అలవాట్లను కళ్లకు కట్టినట్లుగా 'హైదరాబాద్ పోరడు-2' పాటతో అద్భుతంగా రూపొందించారని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం అసద్ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ పోరడు-2' పాటకు సంబంధించిన పోస్టర్‌ను ఉప్పల ఆవిష్కరించి పాటలో భాగస్వాములైన బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో లోకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ ఫేయిర్ కార్యక్రమంలో పాల్గొన్న బాల, బాలికలు, కాలనీ మహిళలు

అగ్రికల్చర్ కాలనీలో ఆకట్టుకున్న సమ్మర్ ఫెయిర్

చంపాపేట, మే 10(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలో శనివారం సాయంత్రం కాలనీ సంక్షేమ సంఘం, నిర్వాహకులు శిల్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఫెయిర్ ఎంతో ఆకట్టుకుంది. బాల, బాలికలకు మ్యూజిక్, ఫుడ్, గేమ్స్, క్విజ్ పోటీలతో పాటు 20 రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పిల్లల్లో జిజ్ఞాస, టీవర్క్, పోటీతత్వం పెరిగేందుకు ఈ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందని కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నిర్వాహకులు శిల్ప పేర్కొన్నారు. కాలనీ ప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జోనల్ కమిటీ ఏకగ్రీవం

చాదర్‌ఘాట్, మే 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ జోనల్ కమిటీ నూతన అధ్యక్షుడిగా మిర్యాలగూడ డిపో శ్రామిక్ ఎ.నర్సింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నగరంలోని సీబీఎస్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యాలయంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణ, జనరల్ సెక్రెటరీ గడ్డం శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు సుభాష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సత్యనారాయణ, గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఆనందంతో కూడిన ఎన్నికల పరిశీలకులు హైదరాబాద్ జోనల్ కమిటీని ఎన్నుకున్నారు. మెదక్ రీజియన్ కార్యదర్శి బి.మొగులయ్య అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. హైదరాబాద్ జోనల్ కమిటీ కార్యదర్శిగా ఎంజీబీఎస్ టీఐ-3 జి.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్వకుర్తి డిపో డ్రైవర్ జె.వెంకటయ్య, వైస్ ప్రెసిడెంట్లుగా మెదక్ రీజియన్ ఏడీసీ ఎన్.మల్లేశం, రంగారెడ్డి రీజియన్‌లోని పికెట్ డిపో టీఐ-3 కె.బాలయ్య, పబ్లిసిటీ సెక్రెటరీలుగా నారాయణఖేడ్ డిపోకు చెందిన నెహ్రూనాయక్, యాదగిరిగుట్ట డిపోకు చెందిన నారాయణ, కోశాధికారిగా దుబ్బాక డిపోకు చెందిన ఎం.రవీందర్, మహిళ ప్రతినిధిగా షాద్‌నగర్ డిపోకు చెందిన భాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన పి.శంకర్, కొల్లాపూర్ డిపోకు చెందిన ఎం.కృష్ణానాయక్, దేవరకొండ డిపోకు చెందిన హనుమానాయక్, మహబూబ్‌నగర్ డిపోకు చెందిన నారాయణ, కల్చరల్ సెక్రెటరీగా సంగారెడ్డి డిపోకు చెందిన సదానందం, షాద్‌నగర్ డిపోకు చెందిన గోపయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి రీజియన్ల నుంచి దార సుందర్, కెవెల్‌నాయక్, ఎన్.రామచంద్రయ్య పాల్గొన్నారు.

మైనర్లకు బండి ఇస్తున్నారా.. జాగ్రత్త

పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు



సైదాబాద్‌లో మైనర్లు బైక్‌పై స్టంట్‌లు (ఫైల్)

సైదాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): తెలిసీ, తెలియని వయస్సు, భావోద్వేగాలు అధికంగా ఉండే కౌమార దశ.. వాహనం చేతుల్లో ఉంటే దూసుకెళ్లే మనస్తత్వం.. ఇవన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. 18 ఏళ్లు నిండని వారికి మనదేశంలో వాహనాలు నడపడానికి అనుమతి లేదు. తల్లిదండ్రుల వద్దో.. బంధువుల నుంచి వాహనాలు తీసుకుని పిల్లలు వాహనాలు నడపాలని ఆతృత పడుతుంటారు. కొన్ని సార్లు పెద్దలు కూడా ఉదారత చూపుతున్నారు. ప్రమాదం జరిగితే.. వాహనం ఇవ్వకుంటే బాగుండేదని ప్రశ్చాత్తాప పడడం తప్ప ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో నగరరోడ్లపై మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ పొందే వయస్సు 18ఏళ్లుగా రవాణా శాఖ గుర్తించింది. ఇంతకన్నా తక్కువ వయస్సు పిల్లలు వాహనాలు నడుపుతూ రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నారు. తల్లిదండ్రులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పరోక్షంగా రోడ్ల ప్రమాదాలకు కారణమవుతున్నారు.

రోడ్లపై దూసుకెళ్తూ..

పిల్లలు తాము కోరుకున్న దాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే పంతం.. స్నేహితుల దగ్గర నాకు బైక్ నడపవచ్చు అని గొప్పగా చెప్పుకోవాలనే తత్వం.. ఏదోలా వాహనం నేర్చుకున్నాక తల్లిదండ్రులు ఏ పనిచెప్పినా బైక్ ఇస్తామంటేనే వెళ్తామంటూ మొండికేస్తున్నారు. కొన్ని సార్లు వారు పోనిలే తమ అవసరం తీరుతుందని వాహన తాళాలు పిల్లల చేతుల్లో పెట్టేస్తున్నారు. అదే అదనుగా రోడ్లపై దూసుకువెళ్తూ ఎదుటి వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నారు.

జరిమానా.. జైలు

మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్లు 18 ఏళ్ల లోపు వారు ఏ వాహనమైనా నడపొద్దు. మైనర్ వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరుస్తారు. కోర్టు ఆదేశాల మేరకు జువెనైల్ హోంకు తరలిస్తారు. అంతేగాకుండా వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తారు.. మైనర్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదం జరిగి ఎదుటి వ్యక్తి మరణిస్తే వాహనం నడిపిన మైనర్‌కు జైలు, రూ.25వేల జరిమానా, యజమానికి సైతం మూడేళ్ల జైలుశిక్ష పడుతుంది. మైనర్లు వాహనాలు నడపడం, వారిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు, తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలి. వేగంగా నడపడం వల్ల ఇతరులకు ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉంది. ప్రమాదం జరిగితే తల్లిదండ్రులతో పాటు వాహన యజమానికి శిక్ష పడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలకు అవగాహన పెంచుకోవాలి.

\- మహ్మద్ అసీఫ్, ఇన్‌స్పెక్టర్, సంతోష్‌నగర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్



సరూర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, కాలనీ అధ్యక్షుడు ధనమ్‌రెడ్డి



శ్రీపురంకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి



కొత్తపేట మోహన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న బీజేపీ నాయకులు

సైనికులకు శక్తినివ్వాలని పూజలు

మన్సూరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించేందుకు వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు శక్తినివ్వాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురంకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పద్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సరూర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఎల్బీనగర్ : భారత సైనికులకు మనోధైర్యంతో పాటు శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, శ్రీవెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండు ధనంరెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి శాంతిప్రసాద్, కోశాధికారి మురళీ, తోర్పునూరి శ్రీనివాస్‌రావు, భోగేశ్వర్‌రావు, సుబ్బారావు, ప్రతాప్‌రెడ్డి, బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జైన్‌బాబు, కబీర్‌దాస్ పాల్గొన్నారు.

హయత్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో..

హయత్‌నగర్ : దేశ సంరక్షణ కోసం భారత ఆర్మీకి మద్దతుగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి శనివారం హయత్‌నగర్ అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి, శివాలయం, అయ్యప్ప, వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆకుపూజ, శివుడికి జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బండారు భాస్కర్, ఉగాది ఎల్లప్ప, గంగని శ్రీనివాస్, మహేష్, గోవిందచారి పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

మోహన్‌నగర్‌లో..

కొత్తపేట: భారత్ పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుతం ఉద్రిక్త పూరిత వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో దేశ సైన్యానికి ధైర్యాన్ని, శక్తిని, విజయాన్ని ఇవ్వాలని కోరుకుంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు బొల్గం యశ్వాల్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపేట మోహన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, శివాలయాల్లో అర్చనలు, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేందర్, యువమోర్చా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు తరుణ్‌సింగ్‌ఠాకూర్, విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యం పోరాటం అజరామరం : సబితారెడ్డి

- కాల్పుల విరమణ ప్రకటన స్వాగతించదగ్గదే
- బడంగ్‌పేట్‌లో ఆపరేషన్ సిందూర్ సంఘీభావ ర్యాలీ



బడంగ్‌పేట్‌లో ఆపరేషన్ సిందూర్ సంఘీభావ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, పాల్గొన్న నేతలు, స్థానికులు

సరూర్‌నగర్, మే 10(ఆంధ్రజ్యోతి): భారత సైన్యం పాక్ శత్రుమూకలను ఎదుర్కొనే క్రమంలో చేస్తున్న వీరోచిత పోరాటం అజరామరం అని, దేశ ప్రజలందరూ మన సైన్యానికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉన్నదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం వెలువడిన కాల్పుల విరమణ ప్రకటన స్వాగతించదగ్గదేనని, అయితే పాక్ తోక జాడిస్తే మాత్రం భారత్ తన చర్యను పునఃప్రారంభించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. పెహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయకులను కాల్చిచంపిన అనంతరం ఇటీవల పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ ధ్వంసం చేసిన నేపథ్యంలో సదరు ఆపరేషన్‌కు మద్దతు తెలుపుతూ శనివారం సాయంత్రం బడంగ్‌పేట్‌లో నిర్వహించిన సంఘీభావ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పాక్ దాడుల్లో అమరుడైన జవాన్ మురళీనాయక్ ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బడంగ్‌పేట్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ తరచుగా భారత్‌తో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. భారత ప్రభుత్వం పహల్గామ్ కాల్పుల సంఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన చర్య ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ విషయమని ఆమె అన్నారు. దేశరక్షణ కోసం తీసుకునే ఏ చర్యకైనా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు పలకాల్సిన అవసరం ఉన్నదని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల నేతలు, సాధారణ పౌరులు, మహిళలు పాల్గొన్నారు.

నీ మరణం వృథా కాదు.. సైనికుడా నీకు సెల్యూట్

- బీఆర్ఎస్ నేతల కొవ్వొత్తుల ప్రదర్శన
- తోకజాడిస్తే పీచమణచాల్సిందే : ఎమ్మెల్యే



వీరమరణం పొందిన భారత సైనికులకు నివాళులర్పిస్తూ ప్రియదర్శిని పార్కు వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇతర నేతలు

ఎల్బీనగర్, మే 10(ఆంధ్రజ్యోతి): నీ మరణం వృథా కాదు... సైనికుడా నీకు సెల్యూట్.. అంటూ బీఆర్ఎస్ నేతలు కొవ్వొత్తులతో వీరమరణం పొందిన భారత సైనికులకు నివాళులర్పించారు. శనివారం రాత్రి సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని పాకిస్థాన్ జరిపిన దాడుల్లో వీరమరణం పొందిన భారత జవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవరావు వనాంజేలకు ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ కుయుక్తులతో భారత భూభాగంపై దాడులకు తెగబడుతున్నదన్నారు. ప్రస్తుత కాల్పుల విరమణ మంచిదైనప్పటికీ పాకిస్థాన్ తోకముడిస్తే మాత్రం పీచమణచాల్సిందేనన్నారు. పాకిస్థాన్ విషయంలో ఇక ఎంతమాత్రం సహించాల్సిన అవసరం లేదన్నారు. పాకిస్థాన్ ప్రత్యక్ష సహకారంతో ఉగ్రవాదులు ఇప్పటికే ఎంతో మంది భారత సైనికులను, సామాన్య ప్రజలను పొట్టనపెట్టుకున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భద్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు ఒకే మాటపై నిలబడడం గర్వకారణమన్నారు. మావంతు బాధ్యతగా భారత సైన్యానికి రూ.1లక్షలు విరాళంగా అందిస్తున్నట్లు సుధీర్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు తిలక్‌రావు, భాస్కర్‌గంగపుత్ర, శ్రీధర్, అశోక్, ప్రభాకర్, ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సింగరేణికాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, గిరిజన నేతలు



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న మాజీ కౌన్సిలర్ కోశిక ఐలయ్య తదితరులు



ఆర్ఎస్ఆర్‌కాలనీలో వీర జవాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

సైదాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో పాక్ సైన్యంతో పోరాడుతూ వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు సింగరేణి కాలనీలో సీపీఐ, గిరిజన జేఏసీ నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీర జవాన్ మురళీనాయక్ చేసిన పోరాటం, చూపిన సాహసం వృథాకాదని, దేశం ఐచ్ఛితంగా గొప్ప విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు షేక్ మహమూద్, శంకర్ నాయక్, జేఏసీ నేతలు శంకర్, గజానాయక్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్: భారత్, పాక్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తల్లో పాకిస్థాన్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ చిత్రపటానికి శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కోశిక ఐలయ్య ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చౌరస్తా వద్ద నివాళ్లు అర్పించారు. అనంతరం రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో కమ్మగూడ, ఇందిరమ్మ కాలనీలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : దేశం కోసం పోరాడి వీర మరణం పొందిన జవాన్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రజా సంఘాల కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, హరిష్, చందు, శివలింగం, సూర్య పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

దేశ సరిహద్దులో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శనివారం కుంట్లూర్ ఆర్ఎస్ఆర్ కాలనీలో జవాన్ చిత్రపటానికి సీపీఐ నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను అంతమొందించాలన్నారు. వీర జవాన్ కుటుంబానికి దేశ ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, యాదగిరి, నవనీత, సైదులు, వినోద్, వీరేష్, గణేష్, గోపీ, పాండు, దేవమ్మ, వెంకట్, రాములు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు

- మలక్‌పేట సబ్‌డివిజన్ జలమండలి డీజీఎం హస్మత్‌అలీ

ఓల్డ్‌మలక్‌పేట, మే 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జలమండలి సరఫరా చేసే నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడితే రూ.5వేలు జరిమానాతో పాటు నల్లా కనెక్షన్ తొలగిస్తామని మలక్‌పేట సబ్‌డివిజన్ జలమండలి డీజీఎం హస్మత్‌అలీ హెచ్చరించారు. శనివారం మలక్‌పేట వాటర్‌వర్క్స్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని తాగునీటి చౌర్యాన్ని అరికట్టేందుకు వాటర్‌వర్క్స్ విజిలెన్స్ విస్తృతంగా తనిఖీలు చేస్తుందన్నారు. ఇప్పటి వరకు మలక్‌పేట సబ్‌డివిజన్ పరిధిలో 70 మోటార్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. పదేపదే నీటిచౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. నీటి సరఫరా చేసేటప్పుడు కొందరు నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడుతున్నారని తద్వారా నీటి సరఫరాలో ప్రెషర్ తగ్గి అన్ని ప్రాంతాలకు సరైన రీతిలో నీటి సరఫరా జరగకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయడం జరిగిందన్నారు. మలక్‌పేట సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు తాగు నీటి సమస్య లేదన్నారు. లీకేజీలు, పైపులైన్ డ్యామేజీల వల్ల నీటి సరఫరా తగ్గిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నల్లా ట్యాక్స్ చెల్లించని మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి వారం రోజుల్లో నల్లా కనెక్షన్ తొలగించనున్నట్టు తెలిపారు. బకాయిలు వసూలు చేసేందుకు మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు విస్తృతంగా వార్డుల్లో పర్యటిస్తున్నారు. మలక్‌పేట సబ్‌డివిజన్ పరిధిలో 23వేల గృహ కనెక్షన్లు, 1,450 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రజలు నల్లాబిల్లులు సకాలంలో చెల్లించి వాటర్‌వర్క్స్ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా డీజీఎం కోరారు.



చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తా సమీపంలోని ప్రధాన రహదారిపై ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట కూలిన డివైడర్ గోడ

కూలిన డివైడర్ల గోడలు.. ప్రమాదాల బారిన వాహనాలు

చంపాపేట : చంపాపేట డివిజన్‌లోని మందమల్లమ్మ చౌరస్తాలోని ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని పలు యూటర్న్‌ల వద్ద డివైడర్ల గోడలు కూలిపోయి వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునేవారు కరువైనారు. మందమల్లమ్మ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం ఎదుట, సాయిరాంనగర్‌కాలనీ ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడంతో అవి ధ్వంసమైనాయి. వాటిని పునఃరుద్ధరించకపోవడంతో యూటర్న్ తీసుకునే సమయంలో వాహనాలు రాళ్లు, సిమెంట్ పెళ్లల మధ్య చిక్కుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తగిన చొరవతీసుకొని కూలిన డివైడర్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

జూన్ 4 నుంచి డిగ్రీ కోర్సులు, ఎంఫార్మసీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షలు, ఎంఫార్మసీ పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు శనివారం ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. బీఏ, బీ కాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను, ఎంఫార్మసీ(పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను జూన్ 4 నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తనిఖీకి వచ్చి తిరిగి వెళ్లె!

మన్సూరాబాద్: లిక్కర్ స్కామ్‌లో అనుమానితులుగా ఉన్నట్టు గుర్తించి వైసీపీ నాయకుడు పుత్తా నారాయణరెడ్డి ఇంటిని తనిఖీ చేసేందుకు తమ సిబ్బందితో శనివారం వనస్థలిపురానికి వచ్చిన అధికారి అడ్రస్ తప్పు అని తెలుసుకుని తిరిగి వెళ్లింది. ఏపీలోని విజయవాడ ఇంటెలిజెన్స్ ఏసీపీ లత తనిఖీ చేసేందుకు సిబ్బందితో కలిసి వనస్థలిపురంలోని హిల్‌కాలనీలోని అడ్రస్‌కు రాగా సదరు అడ్రస్ ఎం.చెన్నప్ప అనే వ్యక్తిదిగా గుర్తించి వెనుదిరిగారు.